క్లుప్తంగా

సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

సత్తుపల్లిరూరల్: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో సత్తుపల్లిలోని ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. సత్తుపల్లి జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీల్లో భారీగా వర్షపు నీరు చేరటంతో ఉత్పత్తి నిలిచిపోయింది. సుమారు 40వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి, 1.5 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు నిలిచిపోయిందని సింగరేణి అధికారులు తెలిపారు.

స్నానాల లక్ష్మీపురానికి సబ్‌స్టేషన్ మంజూరు

వైరారూరల్: మండలంలోని స్నానాల లక్ష్మీపురానికి 33/11 కేజీ విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరైనట్లు విద్యుత్‌శాఖ ఏఈ పి.సుందర్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ. 3.55 కోట్లు నిధులు మంజూరైనట్లు వివరించారు. అలాగే సబ్‌స్టేషన్ నిర్మాణానికి తగిన స్థలం లేకపోవడంతో.. రెవెన్యూశాఖ అధికారులకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు.

ఏన్కూరులో స్పాట్ అడ్మిషన్లకు ఆహ్వానం

ఏన్కూరు: ఏన్కూరు గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఇంగ్లిష్ మీడియం బైపీసీ సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్లు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ తుడి శ్రీనివాసరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాళీగా ఉన్న సీట్లకు అన్ని కేటగిరీల అభ్యర్థులు అర్హులని తెలిపారు. పదిలో 450మార్కులపైగా సాధించిన అభ్యర్థులు ఈ నెల 19న ఉదయం 10 గంటల లోగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు. ప్రతిభ ఆధారంగా సీట్లు కేటాయించడం జరుగుతుందని, వివరాల కోసం 9640268328 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

చలానా బకాయిలు రూ.70వేల వసూలు

తల్లాడ: తల్లాడలో గురువారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వాహనాలకు పెండింగ్ చలానాలను ఎస్‌ఐ ఎన్.వెంకటకృష్ణ ఆధ్వర్యాన పరిశీలించారు. ఈమేరకు 70 వాహనాలపై పెండింగ్ ఉన్న రూ.70,146 చలానా బకాయిలు వసూలు చేయగా, ట్రైనీ ఎస్‌ఐ వెంకటేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణి కార్మికుల నిరసన



జేవీఆర్ ఓసీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న సింగరేణి కార్మికులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ.. ఉద్యోగులు గురువారం సత్తుపల్లి జేవీఆర్ ఓసీ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సింగరేణి అధికారుల వేతనాల పీఆర్‌సీతో జాప్యం తగదని, కొంతకాలంగా అధికారుల గృహాలకు ఉచిత కరెంట్ బిల్లులు, ఐఐటీ, ఫీజు రియాంబర్స్‌మెంట్ వర్తింపు, పదోన్నతులు కల్పించాలన్నారు.

కోర్టు తీర్పును గౌరవిస్తాం..



మాట్లాడుతున్న జనసమితి జిల్లా, మండల అధ్యక్షులు సర్దార్, వాసు

బోనకల్: రాష్ట్రంలో ఇద్దరు ఎమ్మెల్సీలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తామని తెలంగాణ జనసమితి జిల్లా అధ్యక్షుడు షేక్ సర్దార్, మండల అధ్యక్షుడు బీరెల్లి వాసు తెలిపారు. గురువారం బోనకల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడు తూ.. న్యాయ వ్యవస్థలపై తమ పార్టీకి సంపూర్ణ విశ్వాసం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రొఫెసర్ కోదండరామ్ అనేక పోరాటాలు నిర్వహించినందుకు గాను కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తించి ఎమ్మెల్సీ పదవి గవర్నర్ కోటాలో ఇచ్చిందన్నారు. సంవత్సర కాలం పూర్తి అయిన తరువాత తీర్పు రావడం విచారకరమన్నారు.

చదువుతోనే అభివృద్ధి

మధిర: చదువుతోనే వ్యక్తిగత అభివృద్ధితోపాటు దేశాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంఈఓ ప్రభాకర్, శ్రీనిధి జూనియర్ కళాశాల గౌరవ అధ్యక్షుడు దండెం సత్యనారాయణరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక వర్తక సంఘం కల్యాణ మండపంలో నిర్వహించిన కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు ఉన్నతంగా చదవాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ అనీల్‌కుమార్ నెహ్రూ మాట్లాడుతూ.. విద్యార్థులు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

ముంచెత్తుతున్న వరద



ఎర్రుపాలెం : నీట మునిగిన వరి పొలాలు

- పలుచోట్ల నిలిచిపోయిన రాకపోకలు
- పొలాల్లోకి చేరిన నీరు
- ఆందోళనలో రైతులు, ప్రయాణికులు

జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువ నుంచి వస్తున్న వరదతో పలు ప్రాంతాల్లో వాగులు, చెరువులు అలుగు పోస్తున్నాయి. దీంతో లోలెవల్ చప్టాలపైకి వరద చేరి గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా వరి పొలాలు, పత్తి చేన్లలోకి నీరు చేరగా రైతులు ఆందోళన చెందుతున్నారు. కాగా, రహదారులపైకి వరద చేరిన చోట పోలీసులు, రెవెన్యూ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటుచేసి ప్రమాదాలు జరగకుండా రాకపోకలు నిలిపివేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ముదిగొండ : వల్లభి వద్ద రోడ్డుపై ప్రవహిస్తున్న వరద



బోనకల్ : బస్టాండ్‌లో నిలిచిన నీరు



సత్తుపల్లిటౌన్ : అలుగు పారుతున్న తామరచెరువు



కల్లూరురూరల్ : అలుగుపోస్తున్న నాగులచెరువు



వైరారూరల్ : వైరా నది ఉధృతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై రామారావు



చింతకాని : మత్కేపల్లిలో నీట మునిగిన పొలం



ఏన్కూరు : ఆరికాయలపాడు వాగును పరిశీలిస్తున్న తహసీల్దార్ శేషగిరిరావు



తల్లాడ : బిల్లుపాడు - రామచంద్రాపురం మధ్య లోలెవల్ బ్రిడ్జిపై వరద

అమ్మవారికి ప్రత్యేక పూజలు



గీతా మందిరంలో అమ్మవారికి సారె సమర్పిస్తున్న భక్తబృందం

సత్తుపల్లిటౌన్: శ్రావణమాసం సందర్భంగా సత్తుపల్లి పట్టణంలోని గీతాజ్ఞాన మందిరంలో గల శ్రీదేవి భూదేవి, రుక్మిణి, సత్యభామ, వాసవీమాత, శ్రీకోదండ రామాలయంలోని సీతమ్మ వారికి.. పట్టణంలోని హనుమాన్, ఆర్యవైశ్య మహిళా భక్తబృందాల ఆధ్వర్యంలో గురువారం చీర, సారె సమర్పించి పూజలు చేశారు. అమ్మవార్లకు ఒడినింపు కార్యక్రమం నిర్వహించారు. సన్నాయి వాయిద్యాలతో ఊరేగింపుగా సారెతో మహిళలు తరలివెళ్లారు. అనంతరం భక్తులకు పసుపు,కుంకుమలు అందించారు.

ముత్యాలమ్మకు..



మల్లారంలో ముత్యాలమ్మకు పూజలు చేసి నైవేద్యం పెట్టిన మహిళలు

తల్లాడ: మండలంలోని పలుగ్రామాల మహిళలు రకరకాల పిండివంటలు, పాయసం వండుకుని సమీపంలోని ముత్యాలమ్మ అమ్మవార్లకు సమర్పిస్తారు. అలాగే చీరలు, గాజులు సమరిపంచి పసుపు, కుంకుమలతో పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకుంటారు.

ఐబీ డీఈఈగా సతీష్‌కుమార్



బాధ్యతలు స్వీకరిస్తున్న పి.సతీష్‌కుమార్

సత్తుపల్లిరూరల్: సత్తుపల్లి నీటిపారుదల శాఖ డీఈఈగా పి.సతీష్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఖమ్మం నీటిపారుదల శాఖలో క్వాలిటీ జేఈఈగా పని చేస్తూ పదోన్నతిపై విధుల్లో చేరారు. ఇక్కడ ఇన్‌చార్జ్ డీఈఈగా ఉన్న మరియన్న నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి జేఈ ఎం.మల్లికార్జున్ ఉన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు



భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎర్రుపాలెం: మండలంలోని తక్కెళ్లపాడు, భీమవరం, ఎర్రుపాలెం గ్రామాల్లోని శ్రీసాయి బాబా ఆలయాల్లో బాబాకి గురువారం ఆయా దేవాలయాల అర్చకులు స్వామికి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేశారు. బాబా విగ్రహాలకు పంచామృతాలతో అభిషేకాలు చేసి కర్పూర హారతులతో పూజలు చేశారు. మండలకేంద్రంలోని శ్రీసాయి నిలయంలో భక్తులకు పలువురు దాతలు అన్నదానం చేశారు.

వంటగది నిర్మాణానికి శంకుస్థాపన



భూమిపూజ చేస్తున్న చైర్ పర్సన్ ప్రమీల, రామారావు దంపతులు

మధిర: మధిర పట్టణంలోని బంజారా కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పాతశాల వంటగది నిర్మాణానికి గురువారం ఆలయ కమిటీ చైర్ పర్సన్ గుర్రం ప్రమీల, రామారావు దంపతులు భూమి పూజ చేశారు. సాయి బాలాజీ టౌన్‌షిప్ నిర్వాహకులు రేగళ్ల బ్రహ్మారెడ్డి, పురం సంగారావు, తెల్లమేకల శ్రీనివాసరావుతో పాటు పలువురు దాతల సహకారంతో వంటగది నిర్మించనుండగా.. వంటకు అవసరమైన సిలిండర్, గ్యాస్‌స్టవ్ తదితర సామగ్రిని శ్రీ సాయి వెంకటేశ్వర హెచ్‌పీ గ్యాస్ అధినేత దోసపాటి కల్యాణి వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు మల్లాది వాసు, పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, గంగవరపు వీరారెడ్డి, చీదిరాల సత్యనారాయణ, చేడె కోటేశ్వరరావు, కటకం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో గెలుపే అమరులకు నివాళి



మాట్లాడుతున్న హేమంతరావు

కొణిజర్ల: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించడమే అమర వీరులకు మనమందించే నిజమైన నివాళి అని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు అన్నారు. గురువారం కొణిజర్లలో నిర్వహించిన సీపీఐ సీనియర్ నాయకుడు, మాజీ సొసైటీ చైర్మన్ బండారు పుల్లయ్య సంస్మరణ సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు పుల్లయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, మండల కార్యదర్శి భాస్కరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో సత్తా చాటాలి..



మాట్లాడుతున్న గోపాల్‌రావు

బోనకల్: స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడిపల్లి గోపాల్‌రావు పార్టీ శ్రేణులకు సూచించారు. గురువారం ఆ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజవర్గ వ్యాప్తంగా గుర్తించి పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పంట నష్టంపై అధికారుల సర్వే చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, తుశ్లూరి రమేష్, శ్రీను, సునీత, వాణి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నర్వనేని వర్ధంతి వేడుకలు



నర్వనేని స్మారక స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరారూరల్: మండలంలోని ముసలిముడుగు గ్రామంలో మాజీ ఎంపీటీసీ, సీపీఎం సీనియర్ నాయకుడు నర్వనేని సత్యనారాయణ వర్ధంతి వేడుకలను గురువారం రైతు సంఘం, సీపీఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నర్వనేని స్మారక స్తూపానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నర్వనేని వెంకట్రావు, నర్వనేని శ్రీనివాసరావు, తుమ్మల జాన్‌పాపయ్య, షేక్. మొహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



మధిర: రైతులకు సూచనలు చేస్తున్న ఏడీఏ విజయచంద్ర

మధిర/ఎర్రుపాలెం: మధిర మండలంలోని దిడుగుపాడు గ్రామంలో ఏడీఏ ఎస్.విజయ్ చంద్ర, ఏఓ కె.సాయి దీక్షిత్, ఎర్రుపాలెం మండలంలోని కేసిరెడ్డిపల్లి, బనిగండ్లపాడు, ఎర్రుపాలెం గ్రామాల్లో ఏఓ బి.సాయిశివ గురువారం పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలో నిల్వ నీటిని బయటకు పంపించాలని, లేకపోతే సూక్ష్మధాతులోపం, ఎండుతెగులు వచ్చే అవకాశం ఉందన్నారు. నీరు నిలబడిన చోట 10 గ్రాముల యూరియాను లేదా 19:19:19 లేదా 13:0:45 లీటర్ నీటిలో కలుపుకొని వారంలో రెండుసార్లు పిచికారీ చేయాలన్నారు. ఎండుతెగులు కోసం ఎకరానికి 20 కేజీల యూరియా, 10కేజీల పొటాష్‌తో కలిపి వాడాలని సూచించారు. పంట 90రోజుల తర్వాత పైపాటుగా ఎటువంటి ఎరువులను వేయవద్దన్నారు. రైతులందరూ నానో యూరియాను వాడాలని, దీంతో దిగుబడి పెరగడంతోపాటు ఖర్చు తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మధిర ఏఈవోలు బాలకృష్ణ, వెంకటేష్ టి.జిష్ణు, రైతులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించండి



సమావేశానికి హాజరైన వివిధ విభాగాల అధికారులు

సత్తుపల్లి: సింగరేణి సంస్థలో కిష్టారం ఓసీ నిర్దేశించిన లక్ష్యంకంటే అత్యధిక బొగ్గు ఉత్పత్తి చేస్తుందని మల్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు పేర్కొన్నారు. గురువారం కిష్టారం ఓసీలో.. ఏరియా జీఎం షాలేంరాజు ఆధ్వర్యాన మల్టీ డిపార్ట్‌మెంట్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ప్రతీ ఒక్కరు అంకితభావం, సమిష్టి కృషితో పనిచేస్తూ నాణ్యత, ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచాలని సూచించారు. ఈ సమావేశంలో డీజీఎం యోహాన్, పీఓ నర్సింహారావు, కమిటీ సభ్యులు కోటిరెడ్డి, సుమలత, ఇంజనీర్ రమణారావు, రామకృష్ణ, బాబు, కిషోర్, బాలాజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకత వెలికితీయాలి



విజేతలకు బహుమతులు అందిస్తున్న కళాశాల యాజమాన్యం

వైరా: ప్రతి విద్యార్థిలో ఏదో ఒక సృజనాత్మకత ఉంటుందని, దానిని వెలికి తీయాల్సిన బాధ్యత అధ్యాపకులపై ఉందని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.నవీన జ్యోతి అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని వైరా ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధర్యంలో వైరా, కొణిజర్ల, తల్లాడ మండలాల్లోని 16 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో స్వాతంత్ర్య ఉద్యమ ఘట్టాలు ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గెలుపొందిన విజేతలకు గురువారం వైరా కళాశాలలో బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్, వివిధ పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మహిళా గురుకులంలో తిరంగా ర్యాలీ



కొణిజర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కళాశాల బాలికలు, అధ్యాపకులు

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో గురువారం తిరంగా ర్యాలీ నిర్వహించారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ల ఆధ్వర్యంలో బాలికలు జాతీయ జెండాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించారు. గురుకుల కళాశాల నుంచి తనికెళ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రజని, వైస్ ప్రిన్సిపల్ నవ్య, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ రజిత, సారిక, శ్రావణి, శోభ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..



ఎర్రుపాలెం రింగ్ సెంటర్‌లో..

ఎర్రుపాలెం: మండల కేంద్రలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు జాతీయ జెండాలుపట్టుకుని తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ కిసాన్‌ఖేత్ రాష్ట్ర కమిటీ సభ్యుడు నూతక్కి నర్సింహారావు, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణారావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పంద్రాగస్టు సందడి..



మూడు రంగులతో టీషర్టులు



సత్తుపల్లిలో స్వాతంత్ర్య దినోత్సవ సామగ్రి కొనుగోలు చేస్తున్న దృశ్యం

సత్తుపల్లిటౌన్: పంద్రాగస్టు వేడుకలకు ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. సత్తుపల్లిలో స్వాతంత్ర్య దినోత్సవం కోసం త్రివర్ణజెండాలు, టోపీలు, బ్యాడ్జీలు, మూడు రంగుల తోరణాలు, చిన్నారుల టీషర్టుల కొనుగోళ్లతో సందడి నెలకొంది. మిఠాయిల పంపిణీ కోసం స్వీట్‌షాపుల్లోనూ వీటి కొనుగోళ్ల హడావుడి కనిపిస్తోంది.